ఆపరేషన్ డ్రోనాచార్య

- కాకినాడ నగరంలో ఇక పటిష్ట నిఘా
- పోలీస్ శాఖలో పెరిగిన వినియోగం
- ప్రయోజనాలెన్నో అంటున్న అధికారులు



కాకినాడ నగర శివారులో డ్రోన్ నిఘా

కాకినాడ క్రైం: పెరుగుతున్న సాంకేతికత, విస్తృతమవుతున్న మేధస్సుకు సరిసమానంగా నేరాల సంఖ్యా పెరుగుతోంది. నేర ప్రవృత్తి విస్తరిస్తూ ప్రాణ సంకటంగా, భద్రతా ప్రమాణాలకు గొడ్డలిపెట్టుగా పరిణమిస్తోంది. మంచి విషయాల్లో వినియోగించని తెలివితేటలు, తప్పు చేయడంలో, అక్కడి నుంచి చాకచక్యంగా తప్పించుకోవడంలో వినియోగిస్తూ కరుడు గట్టిన నేరస్తులు పోలీస్ శాఖను ముప్పతిప్పలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎత్తైన ప్రదేశాల నుంచి నిఘా కొనసాగిస్తూ అనుసరించే గుణం కలిగిన డ్రోన్లతో భద్రతా చర్యలకు ఇటీవలి కాలంలో ఎనలేని ప్రాధాన్యం పెరిగింది. కాకినాడ పోలీసుల అమ్ముల పొదిలో కొత్తగా మరిన్ని హై రిజల్యూషన్ కెమేరాలు కలిగిన డ్రోన్లు వచ్చి చేరాయి. ఇటీవల కాకినాడలోని పెరేడ్ మైదానంలో ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని కాకినాడలో 13 డ్రోన్లను అందుబాటులోకి తెచ్చారు. వీటిలో సింహభాగం నగర భద్రతకు కేటాయించారు.

మొత్తం 15 డ్రోన్లు

జిల్లా పోలీస్ శాఖలో పాతవి 2, కొత్తవి 13 మొత్తం 15 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయి. కొత్త డ్రోన్ల ఖరీదు రూ.24 లక్షలు. వీటి వినియోగంపై ప్రతి స్టేషన్ నుంచి ఇద్దరు చొప్పున 97 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

కాకినాడకే ఎక్కువ

డ్రోన్ల కేటాయింపు కాకినాడకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇందుకు ప్రధాన కారణం జిల్లా కేంద్రం కాకినాడ కాగా పోలీస్ సహా ప్రభుత్వ కార్యాలయాన్నీ కాకినాడ కేంద్రంగా పనిచేస్తున్నాయి. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే విద్యాలయాల సంఖ్య కాకినాడలోనే ఎక్కువ. వర్తక, వాణిజ్యాలు నగరం కేంద్రంగా సాగుతున్నాయి. ఇవి కాక, జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే కాకినాడలో నమోదవుతున్న వివిధ నేరాల సంఖ్య ఎక్కువ. అనుమానితుల సంచారం, గంజాయి క్రయవిక్రయాలు నగరంలోనే ఎక్కువని పోలీసులు గుర్తించారు. నగరానికి శివారు, నిర్మానుష్య ప్రాంతాలు కూడా ఎక్కువే. సాగర తీరం చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందన్న విమర్శల నేపథ్యంలో జిల్లాలో మిగిలిన ప్రాంతాలతో పోల్చుకుంటే కాకినాడలోనే నిఘా ప్రయోజనాల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారు. కాకినాడ వన్, టూ, త్రీ టౌన్, పోర్టు, ట్రాఫిక్-1, ట్రాఫిక్-2తో పాటు కాకినాడ సర్కిల్‌లో అదనంగా రెండు డ్రోన్లను అందుబాటులో ఉంచారు.

ఇవీ ఉపయోగాలు...

డ్రోన్లను బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా క్లౌడ్ బీట్స్‌తో నిర్వహించే పగలు, రాత్రి గస్తీని ముమ్మరం చేస్తారు.

థర్మల్ సెన్సార్ డ్రోన్లు

నూతనంగా సమకూర్చిన 13 డ్రోన్లు థర్మల్ సెన్సార్ కలిగి ఉన్నాయి. చిమ్మ చీకటిలోనూ కదలికల్ని గుర్తించగలగడం ఈ డ్రోన్ల ప్రత్యేకత. రాత్రి పహారాకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. ఎదురుగా కొట్టే లైటింగ్స్, హోరు గాలులు, వాతావరణంలో అసాధారణ మార్పులు ఈ డ్రోన్ల పనితీరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపలేవు.

సవాళ్లు కూడా

వర్షంలో డ్రోన్ల పనితీరు మందగిస్తుంది. పూర్తి స్థాయిలో పనిచేయవు. బాగా తడిస్తే పాడయ్యే అవకాశం కూడా ఉంది. అలాగే డ్రోన్లు సేకరించిన డేటా చౌర్యానికి గురికావచ్చు. సైబర్ ఎటాక్‌లకు ఆస్కారం ఎక్కువ. డ్రోన్ల కొనుగోలు వ్యయంతో కూడుకున్న పని, అలాగే ప్రైవసీ సమస్య డ్రోన్లతో ఎక్కువ.

వ్యక్తిగత జీవితానికి భంగం వాటిల్లితే...

డ్రోన్‌లు వినియోగిస్తున్నది పోలీసులే అయినా నిర్ణీత నిబంధనలకు లోబడే వినియోగించాలి. తక్కువ ఎత్తులో డ్రోన్ల నిఘా కొనసాగించకూడదు. ప్రభుత్వ భవనాలు, రక్షణ సంస్థల కార్యాలయాలపై డ్రోన్లు ఎగరేయరు. సంస్థానాలు, వ్యక్తిగత ఆస్తుల వద్ద ఎగరేయడానికి కచ్చితంగా నేరం జరుగుతున్న దాఖలాలు ఉండాలి. అలాగే మహిళలు ఉండే నివాస ప్రాంతాలపై తక్కువ ఎత్తులో డ్రోన్లు ప్రయోగించరు. ఈ నిబంధనలు పోలీసులకు కూడా వర్తిస్తాయి. పోలీసులు నిఘా పేరుతో డ్రోన్ల ద్వారా వ్యక్తిగత జీవితానికి భంగం కలిగిస్తే ప్రజలు జిల్లా ఎస్పీ లేదా కోర్టును తగిన వీడియో సాక్ష్యాధారాలతో ఆశ్రయించొచ్చు.

ఏఏ పనుల్లో వినియోగం

- 24/7 ఏరియల్ సర్వైలెన్స్
- రియల్ టైం ట్రాఫిక్ మానిటరింగ్
- నేర నియంత్రణ, పరిశోధన
- విపత్తుల స్పందన, రెస్క్యూ ఆపరేషన్లు
- ప్రభుత్వ, రాజకీయ, దైవిక, సాంస్కృతిక, వినోద కార్యక్రమాల్లో పటిష్ట నిఘా
- అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన
- గంజాయి క్రయ విక్రయాలు
- అనుమానితులపై నిఘా
- వివాదాస్పద వాహనాల సంచారం
- రాత్రి పహారా
- పరారైన నేరస్తులను వెదకడం
- భౌతిక దాడికి గురికాకుండా
- తక్కువ ఖర్చుతో వేగవంతమైన, కచ్చిత సమాచార సేకరణ



నగరంలో అందుబాటులోకి వచ్చిన డ్రోన్లు



కాకినాడ మెయిన్ రోడ్‌లో డ్రోన్ నిఘా



డ్రోన్ సాయంతో ట్రాఫిక్ నిర్వహణను పర్యవేక్షిస్తున్న సీఐలు రమేష్, రామారావు



ఇటీవల కాకినాడలో జరిగిన నూకాలమ్మ జాతరలో డ్రోన్ తీసిన చిత్రం

భద్రత మరింత కట్టుదిట్టం



నూతనంగా డ్రోన్లు అందుబాటులోకి రావడం పోలీస్ శాఖకు ఎంతో ఉత్తేజాన్నిచ్చింది. మానవ శక్తిసామర్థ్యాలకు సాధ్యం కాని భద్రత, నిఘా, పర్యవేక్షణ డ్రోన్లతో సాధ్యం. ప్రజలు, ఆస్తుల భద్రత మరింత కట్టుదిట్టమైంది. డ్రోన్లు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి కాకినాడ శివారు ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడ్డాయి. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న వారిని గుర్తించడంలో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

గరికపాటి బిందుమాధవ్,
ఎస్పీ, కాకినాడ జిల్లా

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సత్కారం

బోట్‌క్లబ్: స్థానిక మధురానగర్‌లోని ప్రజా విద్యాలయంలో బుధవారం ఉపాధ్యాయులను కార్యదర్శి వక్కలంక రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థులు దిగ్విజయంగా పరీక్షలు రాయడంతో ఈ సత్కారం చేసినట్లు వక్కలంక రామకృష్ణ తెలిపారు. సుమారు మూడు నెలల నుంచి 10వ తరగతి చదివే విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి చదువు చెప్పడం గొప్ప విషయమని వారి సేవలను కొనియాడారు. అనంతరం ప్రజా విద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయిలకు నగరంలోని ఒక హోటల్‌లో విందు ఏర్పాటు చేశారు.

నూకాలమ్మ ఆలయ హుండీల లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, దేవదాయశాఖ అధికారులు

బోట్‌క్లబ్: స్థానిక పెద్దమార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి హుండీలను బుధవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 20 రోజుల వ్యవధికి రూ.2.67 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ ఎం. మురళీ వీరభద్రరావు తెలిపారు. ఈ హుండీలు లెక్కింపులో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గదుల సాయిబాబా, అమలకంటి బలరాం, చింతలపూడి రవి, అయినాల వెంకటరమణ, కోడూరి కుమారస్వామి, భక్తులు పాల్గొన్నారు.

మెదడులో తేడాలతో ఆటిజం



విద్యార్థులకు సృజనాత్మకత పెంచే క్రీడా పరికరాలు అందిస్తున్న సత్యనారాయణ

బోట్‌క్లబ్: పిల్లలకు మెదడులో తేడాల వల్ల ఆటిజం వస్తుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని ఆసరా ఆటిజం సెంటర్‌లో విద్యార్థులకు ఆటిజంపై అవగాహన నిర్వహించారు. ఆటిజం పిల్లల్లో సృజనాత్మకత పెంచే క్రీడా సాధనాలు అందించారు. ఆసరా ఆటిజం స్కూల్‌లో విశేషమైన ప్రతిభ కల విద్యార్థులు ఉన్నారని, వారు ఎన్నో రకాల కళాత్మక వస్తువులు తయారుచేస్తున్నారన్నారు. విద్యార్థుల ప్రతిభ గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్న సెంటర్ ప్రధానోపాధ్యాయిని సీరం గీతా సునీతను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు యేరూష, ఆదిత్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ తేజేశ్వరరావు పాల్గొన్నారు.

టెంపుల్ టూరిజంలో భావనారాయణుని ఆలయ అభివృద్ధి

కాకినాడ రూరల్: టెంపుల్ టూరిజంలో భాగంగా సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పంతం నానాజీ వెల్లడించారు. ఈ ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ ఆలయ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఇక్కడకు తీసుకువస్తామన్నారు. భావనారాయణస్వామి గుడి ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియలేదని తాను భావిస్తున్నారని, దేవదాయ శాఖ అధికారులతో పాటు పెద్దలు చాగంటి కోటేశ్వరరావు తన ప్రవచనాలతో ఆలయ ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరుతున్నట్టు చెప్పారు. డీసీ రమేష్‌బాబు, పుల్ల శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్‌ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871

సిగ్నల్ ప్రాసెసింగ్ కమ్యూనికేషన్స్‌పై ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ ప్రసాద్ కంపెనీ చైర్మన్ విద్యాసాగర్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కమ్యూనికేషన్స్‌లో అవాంటెల్ లిమిటెడ్ కంపెనీతో బుధవారం ఎంఓయూ కుదిరింది. వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ కంపెనీ చైర్మన్, పూర్వ విద్యార్థి డాక్టర్ ఎ.విద్యాసాగర్ ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఎంటెక్ మొదటి ఏడాది పూర్తిచేసిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్,, థీసిస్, ప్రాజెక్టును అవాంటెల్ కంపెనీతో చేయవలసి ఉంటుందని, స్టైఫండ్ నెలకు రూ.25 వేలు చెల్లిస్తుందన్నారు. అనంతరం ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం కల్పిస్తామని విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహనరావు, మాజీ వీసీ ప్రసాదరాజు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ బీటీ కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కరప మండల సమావేశం



కరప మండల ప్రజా పరిషత్ కార్యాలయం

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

ఎంపీటీసీ సభ్యులలో అసంతృప్తి

మండల ప్రజా పరిషత్ సభ్యులకు ఇచ్చే గౌరవ వేతనం చెల్లించకపోవడంతో ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తితో ఉన్నారు. తమకే జీతాల బకాయిలు చెల్లించకపోతే అభివృద్ధి పనులు ఏంచేస్తాం, ప్రజా సమస్యలు ఎలా పరిష్కరిస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. ఎంపీటీసీలు ఒక్కొక్కరికి గౌరవవేతనం నెలకు రూ.3 వేలు వంతున 20 నెలలకు రూ.60 వేలు వంతున చెల్లించాల్సి ఉంది. ఎంపీపీకి నెలకు రూ.6 వేలు వంతున రూ.1.20 లక్షలు బకాయి ఉంది. సమావేశం జరగాలంటే కనీసం 8 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉంది. ఎంపీటీసీలు రాకపోతే ఏం చేయాలన్నదానిపై ఎంపీడీఓ, కార్యాలయం సూపరింటెండెంట్ మల్లగుల్లాలు పడుతున్నారు. కోరం కాకపోతే సమావేశం వాయిదా పడుతుందని అధికారులు అంటున్నారు. ఎంపీటీసీలకు ఫోన్లు చేసి సమావేశాలకు రావాలని బతిమాలుతున్నారు. ఈ సారికి ఎలాగైనా రండి గౌరవ వేతనం బిల్లులు పెట్టాం. మంజూరు కాగానే చెల్లిస్తామని అధికారులు వేడుకుంటున్నారు.

వైభవంగా వసంత నవరాత్రి పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు



బంగారు కిరీటం అలంకరణలో బాలాత్రిపుర సుందరీ దేవి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మ వారికి నవావరణార్చన త్రిశతి ఖడ్గ మాల, లలితా అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పెంకేవారి పేటలో అస్తవ్యస్తంగా ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు పార్టీలకతీతంగా నాయకులందరితో చర్చించి తాళ్లరేవు లయన్స్‌క్లబ్ కార్యాచరణ చేపట్టింది. గురువారం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు బుధవారం అన్నిపార్టీల నాయకులు, గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా జంగిల్ క్లియరెన్స్, గ్రావెల్‌తో మెరక పనులు, శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం, దహన సంస్కారాలకు రెండు బెడ్‌ల ఏర్పాటు, శివుని విగ్రహం ఏర్పాటు, గార్డెనింగ్ తదితర పనులు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పొన్నాడ పేరయ్యరాజు, బి.శ్రీనివాసరెడ్డి, గాదిరాజు సతీష్ రాజు, నాయకులు నడింపల్లి వినోద్, బొంతు మోహన్, గంజా సూరిబాబు, రోళ్ల చక్రవర్తి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

బోట్‌క్లబ్: సామర్లకోట నుంచి కాకినాడ శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే పైప్‌లైన్ లీకుల వల్ల గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ నగరంలో పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఉండదని కమిషనర్ భావన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఐదో తేదీన ఉదయం యథావిధిగా మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు. శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచినీటి సరఫరా జరిగే ప్రాంతాలైన శ్రీవిద్యా కాలనీ, డీ మార్టు ప్రాంతం, శ్రీనివాస బ్యాంకు కాలనీ, గైగోలుపాడు, 4, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 49, 50 వ డివిజన్‌లో ప్రజలు ముందుగా తాగునీటిని నిల్వ చేసుకోవాలన్నారు. మంచినీరు అత్యవసరమైతే 98484 71415 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రెవెన్యూ అంశాలను సత్వరం పరిష్కరించండి

కాకినాడ సిటీ: రెవెన్యూ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై ఆర్డీఓలు, అన్ని మండలాల తహసీల్దార్లతో ఆయన సమీక్షించారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల ప్రగతిపై ఆయన చర్చించి రెవెన్యూ సంబంధ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

దివ్యాంగ బస్‌పాస్‌లకు రేపు ప్రత్యేక శిబిరం

కరప: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దివ్యాంగులకు రాయితీతో కూడిన బస్‌పాస్‌లు ఇవ్వనున్నారు. ఈ మేరకు డిపో సిబ్బంది నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ కార్యదర్శి యు.నిర్మిలాదేవి కోరారు. కరపలో బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులు శిబిరానికి వచ్చేటప్పుడు సదరమ్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జెరాక్స్‌లు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, రూ.100 నగదు తీసుకు రావాలన్నారు. మూడేళ్ల కాల పరిమితితో బస్‌పాస్ ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన

కాకినాడ సిటీ: రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ధర్నా చేశారు. 11, 12 పీఆర్సీ సంఘాలను ఏర్పాటు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులతో కారుణ్య నియామకాలు భర్తీ చేయాలని తదితర డిమాండ్లు చేశారు. అనంతరం కలెక్టర్ షణ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు.

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ రాహుల్ మీనా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్ వరప్రసాద్ బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ, ఉప గ్రంథాలయ అధికారి పాల్గొన్నారు.

ఆడపిల్లలకు ఉచితంగా వ్యాక్సినేషన్



విద్యార్థినులకు వేక్సిన్ వేస్తున్న వైద్యులు, సిబ్బంది

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడి జెడ్పీ హైస్కూల్‌లో 12 నుంచి 14 ఏళ్ల వయసు ఉన్న ఆడపిల్లలకి సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ఆల్ ఇండియా విమెన్స్ కాన్ఫరెన్స్ కాకినాడా బ్రాంచ్ ద్వారా బుధవారం వ్యాక్సినేషన్ చేశారు. సంస్థ కార్యదర్శి పద్మజా వాణి మాట్లాడుతూ 37 ఏళ్లుగా కాకినాడ, పరిసర ప్రాంతాలలో మహిళ సంక్షేమం కోసం, బాలికలకు విద్య, ఆరోగ్య సంరక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. సంస్థ చెన్నై శాఖకు చెందిన సభ్యురాలు సరళా కృష్ణన్ రూ.రెండు లక్షల విరాళం ఇచ్చారని, పాఠశాలకు చెందిన సుమారు 70 మంది ఆడపిల్లలకు ఈ వ్యాక్సినేషన్ వేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, సృజన సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ అండ్ ఈవీఎఫ్ సెంటర్ అధినేత డాక్టర్.సత్యవతి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వ్యాక్సిన్ వేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. పండూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి డాక్టర్ మాధవి సిబ్బందితో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. డాక్టర్ నరసింహ నాయక్ మాట్లాడుతూ ఈ వేక్సిన్ ఆడపిల్లలకు ఎన్నో రకాల కాన్సర్ల నుంచి రక్షణ ఇస్తుందన్నారు. ఖరీదైన ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించిన ఆల్ ఇండియా విమెన్స్ బ్రాంచ్ ప్రతినిధులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భానుమతి, కార్యదర్శి పద్మజా వాణి, ట్రెజరర్ మీనాక్షి విజయలక్ష్మి, ఉష, పద్మజ, దుర్గాంబ, శ్రీదేవి, వాకలపూడి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయం విగ్రహ ప్రతిష్ఠకు పూజలు



రామాలయంలో నిర్వహిస్తున్న పూజలు

కరప: స్థానిక నీలయ్యతోట వీధిలో పునర్నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు బుధవారం పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. రామాలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల వినతి మేరకు 2023లో అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేయగా, ఆవీధి ప్రజలు, భక్తులు ఇచ్చిన విరాళాలతో రామాలయాన్ని పునర్నిర్మించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు బుధవారం ఉదయం లకమన బాబూరావు మరో ఐదుగురు దంపతులతో వేదపండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనమ్, పరిషత్, పంచగవ్య ప్రాశనమ్, రక్షాబంధనం, దీక్ష ధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం మండపారాధనలు, అంకురార్పణ, అగ్ని మధనం, సర్వదేవతా హోమాలు, జలాధివాసం, నీరాజన, మంత్ర పుష్పాలు తదితర పూజాదికాలు నిర్వహించారు. ఆలయకమిటీ పర్యవేక్షణలో అన్నదానాన్ని నిర్వహించారు. గురువారం హోమాలు, శుక్రవారం గణపతి పూజ హోమాలు తదితర పూజాదికాలు, అనంతరం విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తడి, పొడి చెత్త విడిగా సేకరించాలి



తడి, పొడి చెత్త సేకరణపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామాల్లో తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలని ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. పెద్దాపురప్పాడు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణపై పంచాయతీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రతి రోజూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైయిన్లలో పూడిక తీయించాలని, దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు తడి, పొడి చెత్త విడి, విడిగా ఇవ్వాలని, పొడిచెత్తతో వర్మీకంపోస్ట్ ఎరువును తయారుచేసి, విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని వివరించి, ప్రజలకు ఈఓపీఆర్డీ అవగాహన కల్పించారు. ఉపసర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

సీపీఎం నాయకులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: ఆదానీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి ఇంటికీ వేస్తున్న స్మార్ట్ మీటర్లు మాకు వద్దని తెలియజేస్తూ ప్రతి ఇంటి ముందు స్టిక్కర్ అంటించాలని కోరుతూ పెద్దాపురం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిందన్నారు. స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని పిలుపునిచ్చిన లోకేష్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.